ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 1 ఫిబ్రవరి 2025






● నరసరావుపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పరిస్థితి

రిజిస్ట్రేషన్లకు.. రద్దీ

● కిటకిటలాడిన కార్యాలయాలు ● నేటి నుంచి భూములకు కొత్త ధరలు
● చార్జీల సవరణతో ఎగబడిన కొనుగోలుదారులు ● ఒత్తిడి తట్టుకోలేక
పలు దఫాలు మొరాయించిన సర్వర్లు

నరసరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా పెరిగిన మార్కెట్ ధరలు శనివారం నుంచి అమ ల్లోకి రానున్నాయి. 29న అమావాస్య. దీంతో గురు, శుక్రవారాలు రిజిస్ట్రేషన్లకు జనం పోటెత్తారు. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారితో రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం(ఫిబ్రవరి 1) నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు ప్రకటించింది. దీంతో స్థిరాస్తులు కొనుగోలు, అమ్మకాలు చేసిన క్రయ విక్రయదారులు గురు, శుక్ర వారాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయాల వద్ద బారులు తీరారు. రెండు, మూడు రోజులు క్రితమే ఆయా దస్తావేజులు సిద్ధం చేసుకున్నప్పటికీ బుధ, గురు వారాలు అమావాస్యకావడంతో ఆయా రోజుల్లో పెద్దగా రిజిస్ట్రేషన్స్


గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పరిస్థితి

జరగలేదు. ఈ నేపథ్యంలో ముందుగానే దస్తావేజులు సిద్ధం చేసుకున్న వారంతా శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేలాది దస్తావేజులు సబ్ రిజిస్ట్రార్ల టేబుళ్ళ మీదకు వచ్చాయి. మొత్తం మీద ఒక్కరోజులోనే ప్రభుత్వ ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరింది. అదే సమయంలో ఒక్కరోజు ముందు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడం ద్వారా ఆయా కక్షిదారులు కొంతమేర అదనపు భారం నుంచి తప్పించుకోగలిగారు. కొన్ని ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాత్రి 10 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. పాత రిజిస్ట్రేషన్ చార్జీలకు చివరి రోజు కావడంతో శుక్రవారం జనం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సందడి నెలకొంది. సాధారణంగా అయితే శుక్రవారం రిజిస్ట్రేషన్లు పేలవంగా ఉంటాయి. అయితే శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి రానుండడంతో పాటు శుక్రవారం నెలపొడుపు కావడంతో శుభసూచకం అనే ఉద్దేశంతో కక్షిదారులు చివరి రోజు వరకు వేచి ఉన్నారు. దీంతో పెద్దసంఖ్యలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్తావేజులు రావడంతో అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలమునకలయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు కొన్ని పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు రాత్రి వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగడంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి పలు దఫాలు మొరాయించాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విఘాతం కలిగింది. గుంటూరు కలెక్టరేట్‌లోని ప్రధాన కార్యాలయంలో, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ కొనసాగింది. ప్రధాన కార్యాలయంలో 220 దస్తావేజులు, కొరిటెపాడు కార్యాలయంలో 100 వరకు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. రేపల్లె, బాపట్ల, అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి వరకు రద్దీ ఎక్కువగా కనిపించింది. అద్దంకిలో సరాసరిన రోజుకు 25 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే శుక్రవారం 110 వరకు జరిగాయి. నరసరావుపేటలో రాత్రి 7 గంటలకు 200 పైగా రిజిస్ట్రేన్లు జరిగినట్టు అధికారులు తెలిపారు. నరసరావుపేటతో పాటు సత్తెనపల్లి, క్రోసూరు తదితర ప్రాంతాల్లో రాత్రి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం నరసరావుపేటలో దాదాపు 227 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.


రాత్రి 9 గంటలకు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉన్న కొనుగోలు దారులు

రియాల్టీపై చార్జీల ప్రభావం

ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణ ప్రాంతాల్లో దాదాపు 10 నుంచి 20 శాతం మేర చార్జీలు పెరిగాయి. సత్తెనపల్లి వంటి కొన్ని పట్టణాల్లో చార్జీలు దాదాపు రెట్టింపయ్యాయి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కూడళ్లలో మాత్రం కొంతమేర ఎక్కువగానే పెరిగాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కొంత కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో రిజిస్ట్రేషన్స్ చార్జీలు వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై కొంత మేర ప్రభావం చూపుతుందని ఆయా వర్గాలు అంటున్నాయి. అంతేగాక పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో మార్కెట్ విలువలు భారీగా పెంచడం వల్ల ప్రజావసరాలకు ప్రభుత్వం భూములు సేకరించాల్సిన తరుణంలో ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంది.

..వరాలిచ్చేనా?

● నిధుల కేటాయింపుల కోసం ఎదురుచూపు



అమరావతి అభివృద్ధి.. తీర ప్రాంతంలో పర్యాటకం పరుగులు.. రైల్వే ప్రాజెక్టులతో పాటు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు అడుగులు.. కేంద్ర పథకాలతో ముడిపడి ఉన్న వివిధ కార్యక్రమాలకు నిధులు.. ఇవన్నీ కేంద్ర బడ్జెట్‌తో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో శనివారం కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ తన బడ్జెట్ ద్వారా ఇచ్చే వరాల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజధాని అమరావతి బాధ్యత తమదేనని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్రం మంజూరు చేసే నిధులపై ఆధారపడి మూడు జిల్లాల పరిధిలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ మేర ఆయా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ఉంటోందని ప్రజలు బడ్జెట్‌పై ఆశక్తి చూపుతున్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో అమృత్ పథకం ద్వారా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం చేయూత ఇవ్వాలని రాజధాని వాసులు కోరుకుంటున్నారు. ఇక పేద, మధ్యతరగతి వర్గాల ఆశలు ఏమేరకు ఆర్థిక మంత్రి నెరవేరుస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనున్నది.

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశ

● మౌలిక సదుపాయాలకు తోడ్పాటు ఉంటుందా?
● ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణాలకు అడుగులు పడేనా
● తీరప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి నిధుల్లో వాటా ఉండేనా
● నిధులు కేటాయిస్తే అమరావతి రాజధాని నిర్మాణం పరుగులే

గుంటూరు, బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేంద్రమైన గుంటూరు.. సుదీర తీర ప్రాంతంతో అలరారుతున్న బాపట్ల.. అభివృద్ధి కోసం ఎదురు చూస్తోన్న పల్నాడు జిల్లాలపై కేంద్రం కరుణించేనా అన్న విషయం మరికొన్ని గంటల్లో తేలనున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిధుల కేటాయింపులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు వస్తాయోనని ఉత్కంఠ నెలకొంది. ఇక సామాన్య ప్రజలు మాత్రం నిత్యావసర సరుకుల ధరలు తగ్గాలని కోరుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లో సుంకాలు తగ్గితే కొంతమేరకు ధరలు దిగి వస్తాయని మధ్య తరగతి వాసులు ఆశిస్తున్నారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇస్తే మిర్చి ధరలు పెరుగుతాయని మిర్చి రైతులు కోరుకుంటున్నారు.

● రైల్వే ప్రాజెక్టుల విషయానికి వస్తే నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణ దశలో ఉన్నది. గత ఏడాది రూ.310 కోట్లు కేటాయించినా అందులో మూలధనం రూ.60 కోట్లు మాత్రమే. మిగతా రూ.250 కోట్లు ఎస్. ఫండ్ రూపంలో

మిగతా 8వ పేజీలో)



● అమరావతి నూతన రైలు మార్గం (106 కిలోమీటర్లు) ప్రాజెక్టు వ్యయం రూ.2679.59 కోట్లు కాగా రూ.50 కోట్ల మూలధనం ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం భూసేకరణ దశలో ఉన్నది. ఈ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా మంజూరు చేస్తే త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడానికి అవకాశం కలుగుతుంది.

అమరావతి ఆశలు

కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిపై ఎన్నో ఆశలు రేపుతోంది. గత బడ్జెట్లో రూ.15 వేల కోట్ల సహాయం ప్రకటించి అమరావతికి ప్రాణం పోసిన కేంద్రం ఈసారి అమరావతి అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కేటాయింపులు ఉంటాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలన తాలూకు ఇబ్బందులు, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి నవనగర నిర్మాణం పరుగులు తీయాలంటే కేంద్రం చేయూత ఎంతో అవసరమ న్నది అటు కేంద్రం, ఇటు రాష్ట్రం భావిస్తున్న నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులపైనే అందరి చూపులు ఉన్నాయి. అమరావతికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ, సివిల్ వర్కు లతో సహా మొత్తం ఖర్చంతా కేంద్ర ప్రభుత్వ మే భరిస్తానని ఇప్పటికే హామీ ఇచ్చింది. దాదా పుగా అలైన్‌మెంటు పూర్తి కాగా రూ.16,310 కోట్లు కేంద్రమే భరించనుంది. ఈ పరిస్థితుల్లో ఇందుకు సంబంధించి బడ్జెట్లో కొంత మేర నిధుల కేటాయింపు ఉండవచ్చని భావిస్తున్నారు. విజయవాడ తూర్పు బైపాస్‌కు కేంద్ర నో చెప్పినందున ఐఆర్ఆర్ విషయంలో తోడ్పాటును ఇవ్వాలన్న డిమాండ్ బలంగా ఉంది. 2014- 19 మధ్య మెట్రో ప్రతిపాదనలు తెరపైకి రాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లో ఉన్న నేపథ్యంలో ఈసారి కేంద్ర బడ్జెట్లో మెట్రో ప్రస్తావన ఉంటుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారు. అదే విధంగా అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటా యిస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. గతంలో అమృత్ పథకం కింద కేంద్రం అమరావతికి కొంతమేర చేయూత నిచ్చింది. వైసీపీ హయాంలో ఆ ప్రస్తావనే లేకుండాపోయింది.

మిర్చియార్డు కార్యదర్శిగా చంద్రిక

● బాధ్యతల స్వీకారం.. అధికారుల అభినందనలు ● మిర్చి రైతుల శ్రేయస్సుకే ప్రాధాన్యమన్న చంద్రిక

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా చంద్రిక బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం యార్డు పరిపాలన భవనానికి వచ్చిన ఆమె చార్జి తీసుకుని ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా పలువురు సెక్రటరీలు, సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. గ్రేటర్ విశాఖపట్టణానికి చెందిన చంద్రిక 2012 గ్రూపు-1 ద్వారా మున్సిపల్ పరిపాలన శాఖలో గ్రేడ్-2 కమిషనర్‌గా ప్రభుత్వ సర్వీసులోకి వచ్చారు. ఆ తర్వాత గ్రేడ్-1, స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. తొలి పోస్టింగ్ బొబ్బిలి మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత మచిలీపట్నం, బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది నుంచి ఆమె డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమె విజ్ఞప్తిని పరిశీలించిన సీఎం చంద్రబాబు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాజాగా గుంటూరు మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పోస్టింగ్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుకు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తనకు ఒక సవాలు లాంటిదని, అందరి సహాయ, సహకారాలు తీసుకుని రైతులు, మార్కెట్ కమిటీ శ్రేయస్సు కోసం కష్టపడి పని చేస్తానన్నారు. ప్రస్తుతం మిర్చి సీజన్ ఉచ్ఛదశలో ఉందని, కచ్చితంగా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ యార్డు కార్యకలాపాలు సజావుగా, సాఫీగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రాధాన్యమిచ్చి కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. అనంతరం సెక్రటరి చంద్రిక మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత చుట్టుగుంటలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత కమిషనరేట్ అధికారులు, జాయింట్ కలెక్టర్, మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా చంద్రికను కలిసి యార్డు కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, జయరామిరెడ్డి, అంజనేయులు, అధికారులు నరేంద్ర, రాఘవరావు, వేమెన్ అసోసియేషన్ల నాయకులు అభినందనలు తెలిపారు.


చంద్రిక



రేపే కానుకమాత తిరునాళ్ల

దూరవిద్య బీఎల్ఐఎస్‌సీ ఫలితాలు విడుదల

పతన సంస్కృతిపై పోరాడుదాం
● ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు

6

మాచర్ల సీహెచ్‌సీకి.. మహర్దశ

● పవర్ గ్రిడ్ సంస్థ నుంచి రూ.72.98 లక్షలు ● 16 కీలక వైద్య పరికరాల కొనుగోలుకు సిద్ధం

నరసరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెం టర్(సీహెచ్‌సీ)కు మహర్దశ పట్టింది. ఆస్పత్రిలో ముఖ్యమైన వైద్య పరికరాల కోసం పవర్ గ్రిడ్ సంస్థ రూ.72.98 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. పవర్‌గ్రిడ్ సదరన్ ఇంటర్‌కనెక్టర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ లిమిటెడ్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ నిధులు ఇవ్వనున్నది. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో పవర్‌గ్రిడ్ ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రంగారావు ఒప్పంద పత్రాలను స్వీకరించారు. సీహెచ్‌సీకి 16 కీలక వైద్య పరికరాలు కొనుగోలు చేయడానికి నిధులను సంస్థ వెచ్చించనున్నది. సంస్థ సహకారం ద్వారా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను గణనీయంగా మెరుగుపరిచి మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రాజెక్టు లక్ష్యం. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విరాళం అందించేందుకు పవర్ గ్రిడ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ కే.నాగమోహన్‌రావు, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో ఎంవోయూ చేసుకుంటున్న పవర్ గ్రిడ్.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

రహదారులకు.. రూ. 5,266 కోట్లు


విస్తరించనున్న దుర్గి - వెల్దుర్తి రహదారి


గోతులు మయంగా కొండమోడు రహదారి

◆ కేంద్రం నిధులతో రోడ్లకు మహర్దశ
◆ పలు రోడ్లు నాలుగు వరసలుగా విస్తరణ
◆ ఇప్పటికే కొన్ని ప్రారంభం.. మరికొన్ని వేగవంతం
◆ రాష్ట్ర రహదారులు.. జాతీయ రహదారులుగా అభివృద్ధి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలోరూ.5,266 కోట్లు మంజూరుతో జిల్లా లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. రెండేళ్లలో రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేస్తోంది. కేంద్ర రహదారి మౌలిక సదుపాయల పథకం కింద జిల్లాలోని పలు రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల విస్తరణతో అటు బాపట్ల, ప్రకాశం ఇటు గుంటూరు జిల్లాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజా రవాణా వేగవంతమవుతోంది. ఇప్పటికే రెండు జాతీయ రహదారుల పనులు పూర్తయ్యాయి. నాగార్జున సాగర్- దావులపల్లి జాతీయ రహదారిని రూ.230 కోట్లతో 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. ఇటీవల ప్రధాని మోదీ దీనిని ప్రారంభించిన విషయం తెలిసిందే.

భారత్ మాలా ప్రాజెక్టులో..

కొండమోడు-పేరేచర్ల 167 ఏజీ జాతీయ రహదారి విస్తరణకు రూ.881.61 కోట్లు మంజూరయ్యాయి. భారత్ మాలా ప్రాజెక్టు కింద పనులు చేపడుతున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ కొలిక్కిరాగా భూసేకరణ దాదాపు పూర్తయింది. పనులకు ప్రధాని మోదీ ఇటీవల విశాఖ పర్యటనలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

రెండు ప్యాకేజీల్లో 167ఏ రహదారి..

కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలోమీటర్లు పొడవున రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతుంది. ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్లు రహదారి పనులను ప్యాకేజీ ఒకటి కింద చేపట్టారు. చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లలో పనులను రెండో ప్యాకేజీలో చేపట్టారు. మొదటి ప్యాకేజీలో పనులు వేగవంతం కాగా రెండో ప్యాకేజీలో పనులు టెండరు, భూసేకరణ దశలో ఉన్నాయి.


బొప్పూడి వద్ద ఓడరేవు రహదారి విస్తరణ పనులు

వినుకొండ నుంచి పేరేచర్ల వరకు

వినుకొండ నుంచి గుంటూరు జాతీయ రహదారి 544డీ విస్తరించేందుకు కేంద్రం నిధులు (మిగతా 8వ పేజీలో)

వర్క్‌షాపు బ్రోచర్ ఆవిష్కరణ



వర్క్‌షాప్ కరపత్రాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో యోగ యాజ్ ఏ థెరపేటిక్ ఇంటర్వెన్షన్ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్‌షాప్ డైరెక్టర్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు వర్క్‌షాపు బ్రోచర్‌లను ఆవిష్కరించారు. విభాగం అధ్యాపకులు, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ కె.సత్యమూర్తి, సిబ్బంది జె.రాజేష్, ఆనంద్ కిషోర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజన్‌పై జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు ఫలవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు పంపాలని సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా పరిశోధకులు, అధ్యాపకులు, మేధావులు తమ పరిశోధన పత్రాలను పంపాలని కోరారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహాం లింకన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, విభాగం పరిశోధకులు, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య బీఎల్ఐఎస్‌సీ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబరు, నవంబరు నెలలో నిర్వహించిన బీఎల్ఐఎస్ సీ కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ విడుదల చేశారు. ఈ ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

పతన సంస్కృతిపై పోరాడుదాం

- ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు
- ఘనంగా అఖిల భారత ప్రజా సాహిత్య, కళా సాంస్కృతిక సభలు ప్రారంభం



మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు, పాల్గొన్న సాహితీ వేత్తలు

గుంటూరు (తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): అణిచివేత రాజకీయ పాలనకు, సనాతనం పేరుతో హీన, బానిస భావ, పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావ సారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి సమయం ఆసన్నమైందని ఆల్ ఇండియా పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు జాతీయ ఉపాధ్యక్షుడు దివి కుమార్ స్వాగతం పలుకుగా ఏఐపీఎల్‌సీఎఫ్ నాయకులు రమణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. 'పీపుల్స్ లిటరేచర్' 11 సంచికను ఆవిష్కరించి జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు కీలక ఉపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో ముంచుకొస్తున్న ఆర్థిక, సామాజిక, సాహిత్య, కళా, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల గొంతుకగా అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక బలమైన ప్రత్యామ్నాయ సంస్థగా కృషి చేస్తుందని వివరించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, సీఎస్ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్ పాల్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదివాసి చిన్నారులు ప్రదర్శించిన 'బుడతల బుర్రకథ', శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై ప్రదర్శించిన 'పోరు దారి' ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని జన సాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. అరుణ పర్యవేక్షించగా, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారుడు టి.వెంకట్రావు ప్రారంభించారు.

'కూటమి' అండగా నిలవాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, పక్కన తిరుపతిరావు, వల్లూరి జయప్రకాష్

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి భారీ విజయం చేకూర్చాలని కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజ్ఞప్తి చేశారు. స్థానిక లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా చేస్తున్న అభివృద్ధిని కొనసాగిస్తామని అన్నారు. గత ఐదేళ్లలో మండలిలో జరిగిన పరిణామాలు చూస్తే తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తామని అన్నారు. కూటమిలో ఉన్న నాయకులను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఆలపాటి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ చదువుకున్న మేధావులను ఎన్నుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తూరి వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్య నాయుడు, శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ.5,266 కోట్లు


(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతపూర్-గుంటూరు రహదారి విస్తరణలో భాగంగా వినుకొండ నుంచి పేరేచర్ల వరకు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తారు. సుమారు 90 కిలోమీటర్ల పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ.2,360 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వినుకొండ నుంచి నరసరావుపేట మీదగా రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనులకు ఎన్‌హెచ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

పనులు వేగవంతం.. ప్రారంభం

- దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు ఇటీవల మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.
- దాచేపల్లి మాచర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారి 167ఏడీగా మార్చారు. రూ.403.22 కోట్లతో పనులు చేపట్టారు. దాచేపల్లి నుంచి గురజాల, రెంటచింతల, పాల్వాయిగేటు మీదగా మాచర్ల వరకు 37 కిలోమీటర్ల పొడవున పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పాల్వాయిగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.
- సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.57.13 కోట్లు మంజూరు చేసింది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70.49 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు భూసేకరణను వేగవంతం చేశారు.
- మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.31.60 కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలోమీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలం పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణకు రూ.21.65 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి మంజూరైంది. మాచర్ల నుంచి విజయపూరిసౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కండ్లకుంట, గుడిపాటి చెరువు మీదగా లచ్చంబావితండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి.

రేపే కానుకమాత తిరునాళ్ల



కానుకమాత ఆలయం

- రూ. 5 కోట్లతో ఆలయం ఆధునికీకరణ

రెంటచింతల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన పురాతన క్రైస్తవ ఆలయాల్లో ఒకటైన రెంటచింతల కానుకమాత దేవాలయం ఆధునికీకరణతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఆర్కిటెక్ట్ ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన గోపురాలు తాపీ పని వారి నైపుణ్యానికి మచ్చుతునకగా ఉన్నాయి. రెంటచింతలలో క్రైస్తవ సంఘం 18వ శతాబ్దంలోనే వెలసినట్లు చరిత్ర చెబుతుంది. 1850లో కానుకమాత చర్చిని కేవలం రూ.4 వేలతో నిర్మించారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిరానికి పూనుకున్నారు. ఈ ఆలయంలో భక్తులు కూర్చోడానికి సరిపోకపోవడంతో 1982లో మరో ఆలయాన్ని నిర్మించి ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆ ఆలయాన్నే రూ.5 కోట్లతో పునర్నిర్మించారు.కేవలం రెండు పిల్లర్లతో ఈ ఆలయ నిర్మాణం జరగడం విశేషం. గోపురాలు 50 అడుగులుండగా ప్రధాన గోపురం 100 అడుగుల ఎత్తులో ఉంది. రెంటచింతల అనాదిగా క్రైస్తవ మతానికి అలంబనగా ఉంది. ఆధ్యాత్మికతకే పరిమితి కాకుండా విద్యాలయాలు, సాగునీటి కాలువలు అభివృద్ధికి కృషి చేస్తున్నారు.


భారీ ఎత్తున ఏర్పాట్లు



ఫాదర్ మర్రెడ్డి

ఫిబ్రవరి 2న కానుకమాత దేవాలయం 175వ తిరునాళ్లను ఘనంగా జరపడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెపారు. 1వ తేదీ 20 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగే తిరునాళ్లకు ముఖ్యఅతిథులుగా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప పాలనాధికారి బిషప్ గాలిబాలి, నల్గొండకు చెందిన గోవిందు జోజి తదితర పీఠాధిపతులు రానున్నారు. ఈ నెల 24న జెండా ప్రతిష్టతో తిరునాళ్ల ఉత్సవాలు ఆరంభమయ్యాయి. 21 సంవత్సరాల తరువాత ఎడ్ల పోటీలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఎక్కడ చూసినా తిరునాళ్ల వాతావరణమే కన్పిస్తుంది.

బాపట్ల ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



బండలాగుడు ఎడ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

రెంటచింతల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 175 తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం న్యూ క్యాటగిరీ ఒంగోలు జాతి బండలాగుడు ఎడ్ల పోటీలను నిర్వహించారు. అత్తోట శిరీషా చౌదరి,శివకృష్ణ చౌదరి (వేటపాలెం, బాపట్ల జిల్లా) ఎడ్ల జత 3900.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి (సంతమాగులూరు, బాపట్ల జిల్లా) ఎడ్ల జత 3900 దూరం లాగి రెండో బహుమతి, తనుబొద్ది రవిశంకర్‌రెడ్డి(ఉప్పుమాగులూరు, బాపట్ల జిల్లా)ఎడ్ల జత 3300 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, డాక్టర్ హుస్సేన్(కోదాడ)పిన్నెబోయిన అభిషేక్ యాదవ్ (రెంటాల, రెంటచింతల మండలం)కంబైన్డ్ ఎడ్ల జత 3287.8 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, కొలుసు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు (గన్నవరం,కృష్ణాజిల్లా) ఎడ్ల జత 3135 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి, ఎర్రం రాజశేఖర్ యశ్వంత్ (దొండపాడు, నరసరావుపేట)2889.6 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని కైవసం చేసుకున్నాయి. మొత్తం 10 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొనగా 9 జతల వరకు బహుమతులు, 1 జతకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులైన వైఎల్ మర్రెడ్డి, సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, రాయపరెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, శౌర్రెడ్డి, రామకృష్ణ, జోసఫ్ రెడ్డి, ఆదిరెడ్డి, మర్రెడ్డి పాల్గొన్నారు.

కారు, స్కూటర్ ఢీకొని ఒకరు మృతి

నకరికల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేవవరం రోడ్డు వద్ద కారు, స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్లకు చెందిన షేక్ జిలానీ(30) స్కూటర్‌పై మాచర్ల వైపు వెళ్తుండగా నకరికల్లు మండలం దేవవరం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో జిలానీకి తీవ్ర రక్త స్రావం అయింది. సమాచారం అందుకున్న 108 పైలెట్ భాస్కర్, ఈఎంటీ వెంకటేష్ జిలానీని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు జిలానీ మృతి చెందినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలోనే...
ఎన్జీరంగా వర్సిటీలో అక్రమాలు

- రాజకీయ ఒత్తిడితో జరిగిన బదిలీలు రద్దు
- డబ్బులిచ్చి పదవిలో ఉండాల్సిన అవసరం లేదు
- 'ఆంధ్రజ్యోతి'తో వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు రైస్ బౌల్ (ఆహారపు గిన్నె) అని పేరు రావటంలో ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీది కీలక పాత్ర!. ఈనాటికీ రాష్ట్రంతో పాటు, దేశంలోని అనేక రాష్ట్రాలు కడుపునిండా అన్నం తింటున్నాయంటే దానికి వెనుక వర్సిటీ శాస్త్రజ్ఞుల శ్రమ, కృషి ఎంతో ఉందని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఆరు దశాబ్దాల పరిశోధన యాత్రలో హరితవిప్లవానికి బాటలు వేసిన యూనివర్సిటీ రాశి, వాసి గురించి ఎంత చెప్పినా తక్కువే! అటువంటి యూనివర్సిటీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయాలకు వేదికైంది. ప్రభుత్వం మారిన తర్వాత వీసీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రస్తుత వీసీ శారదా జయలక్ష్మిపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీ 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. గడచిన ఐదేళ్ల కాలంలో అక్కడ జరిగిన అనేక విషయాలను వివరించారు.

● సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అక్రమాలు?

వీసీ: 2021 లో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో 2016లో సవరించిన ఉత్తర్వులు పాటించలేదు. అప్పుడు కూడా 2006నాటి నిబంధనలే పాటించటం వల్ల కొందరికి ప్రమోషన్లు దక్కలేదు. అప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి వీసీ గా ఉన్నారు. నేను వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2022లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డిపార్ట్మెంటల్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగానే ప్రమోషన్లు ఇచ్చాం. జీఓ 20 ప్రకారం జరిగిన ప్రమోషన్లలో అక్రమాలకు తావులేదు.

● బదిలీల వ్యవహారంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు?

వీసీ : వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జరిగిన బదిలీల్లో రాజకీయ ఒత్తిళ్లు ఉన్న మాట నిజమే. నేను రాకముందే అక్రమ బదిలీలు జరిగాయి. దానికి పాత వీసీ ఉన్నప్పుడే బీజం పడింది. అప్పుడే తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఎక్కువ మందిని నియమించారు. ఇక్కడ(లాం) ఉన్న చాలామంది అర్హులైన సైంటిస్టులను అకారణంగా చాలా దూరానికి బదిలీ చేశారు. వాళ్లకు అక్కడ మూడేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారు. ఇవన్నీ గతంలో జరిగినవే. నేను వీసీగా బాధ్యతలు తీసుకున్నాక ఆ తప్పిదాలను, అక్రమాలను సరిచేసే బాధ్యతను తీసుకున్నాను. అర్హులైన వారు ఎవరైతే ఉన్నారో వాళ్లను తిరిగి లాంకు తెచ్చాను. కేంద్రం జీతాలు చెల్లించే కళాశాలలో అవసరమైన సిబ్బందిని నియమించాను.

● మీ పైన కూడా వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారా?

వీసీ: బదిలీల విషయంలో మా మీద ఎంత ఒత్తిడి తీసుకువస్తారో చెప్పలేను. ఉదాహరణకు ఒక ఉదంతం చెబుతాను. లాం మెయిన్ ఆఫీసులో ఉన్న ఒక ఉద్యోగిని లాంలోనే ఉన్న మరో చోటికి బదిలీ చేశాను. వైసీపీకి చెందిన ఒక ముఖ్య నేత ఉదయాన్నే ఫోన్ చేసి ఆ ఉద్యోగిని ఉన్న చోటే ఉంచమని ఒత్తిడి తెచ్చారు. దాని కోసం ఒక మంత్రి.. ఇంకా చాలామంది ఫోన్ చేశారు. చాలా సందర్భాల్లో రాజకీయ నేతలు చెప్పిన బదిలీలు చేయక తప్పని పరిస్థితి.

● 2024 ఎన్నికలకు ముందు జరిగిన అక్రమ బదిలీలపై చర్యలు ఏమిటి?

వీసీ: అప్పట్లో రాజకీయ ఒత్తిడితో జరిగిన ప్రతి బదిలీనీ రద్దు చేయాలని నిర్ణయించాం. డిప్యుటేషన్‌పై ఉండే అదనపు సిబ్బందిని వారి ఒరిజినల్ ప్రదేశానికి పంపిస్తాం. ఎవరు ఎక్కడ జీతం తీసుకుంటున్నారో అక్కడికే వెళ్లిపోయేలా చర్యలు చేపడతాం.

● ప్రస్తుతం ఉన్న పదవిలో కొనసాగే విషయం?

వీసీ: ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు. అన్ని అర్హతలూ ఉన్నాయి కాబట్టే నన్ను ఈ పదవికి ఎంపిక చేశారు. అప్పట్లో సీనియారిటీ లిస్టు పంపేటప్పుడు కేవలం విష్ణువర్ధన్ రెడ్డి ఒక్కరి పేరు మాత్రమే పంపారు. ఆ లిస్టు చూసి అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొత్తం పది మంది పేర్లతో సీనియారిటీ జాబితా పంపమని చెప్పారు. ఆ జాబితా ప్రకారం నాకు అవకాశం వచ్చింది. అది ఎన్ని రోజులుంటే అన్ని రోజులు కొనసాగుతాను. డబ్బులిచ్చి ఈ పదవిలో కొనసాగాల్సిన అవసరం లేదు.

● నిధుల దుర్వినియోగంపై ఏమంటారు?

వీసీ: యూనివర్సిటీకి సంబంధించిన నిధుల ఖర్చు, కేటాయింపుల వ్యవహారంలో వీసీ పాత్ర ఏమీ ఉండదు. సంబంధిత విభాగాధిపతులు అన్ని ఫైళ్లూ పరిశీలించి నాదగ్గరకు పంపుతారు. వాటిని చూసి ఆమోద ముద్ర వేయటమే నా పని. ఎక్కడా నగదు వ్యవహారం ఉండదు. అంతా ఆన్‌లైన్ చెల్లింపులే. మెయిన్ బిల్డింగ్ నిర్మాణం అంతా ప్రభుత్వం, ఏపీఐఐసీకి మధ్యే జరుగుతుంది. అందులో వర్సిటీ ప్రమేయం, పాత్ర ఏమీ ఉండదు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న లారీ

- ఒకరు మృతి



మృతి చెందిన గణేష్

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలకానగర్‌కు చెందిన పొన్నం గణేష్(33) ఐషర్ వాహనంలో హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లాలోని చేపల చెరువుకు కోళ్లకు చెందిన వ్యర్థాలను తీసుకు వెళ్తున్నాడు. మర్రిచెట్టుపాలెంలోని కాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేష్ మృతి చెందాడు. వాహనం ముందు భాగం బాగా దెబ్బతింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మణికృష్ణ సందర్శించారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 552.30 అడుగులు ఉంది. ఇది 214.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2684 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,165 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,765 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

70,952 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 61,331 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,952 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,781 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	14500
నెంబరు. 5	9000	13000
273	7500	14000
341	8000	15000
4884	9000	12500
సూపర్ 10	8000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	14500
బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	13000
తెల్లకాయలు	4000	10000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	13000
నెంబరు.5	--	--
273	--	--
341	10000	11000
4884	--	--
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	14000
బ్యాడిగి	9500	12000
దేవనూరు డీలక్స్	10000	11500
తెల్లకాయలు	4500	8500

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 35.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దుర్గి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ రామయ్య తెలిపారు. దుర్గి, ధర్మవరం, ముటుకూరు, కోలగుట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న ప్రమాణస్వీకారం

పిడుగురాళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారం ఈ నెల 3వ తేదీ సోమవారం జరుగనున్నదని కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, యరపతినేని నిఖిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావుతో పాటు పలువురు నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

మాచర్లటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘ పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటల నుంచి 105 మంది సచివాలయ సిబ్బంది 6382 మంది పెన్షన్ దారులకు సుమారు రూ. 2,80,27,000లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గత నవంబరు, డిసెంబర్ నెలల్లో పింఛన్ తీసుకోని వారికి జనవరి నెలతో కలిసి మొత్తంగా మూడు నెలల పింఛన్‌ను అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇంటి వద్దనే ఉండి పింఛన్ పొందాలని కమిషనర్ వేణుబాబు కోరారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

పిడుగురాళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ పి శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. ఆహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేసి సమయపాలన పాటించడంతో పాటు ఆహారం కోసం వచ్చే ప్రతిఒక్కరి పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు.

కంటైనర్ బోల్తా

నకరికల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు పోలీసు స్టేషన్ ఎదురుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై నుంచి కంటైనర్ అదుపు తప్పి పోలీసు స్టేషన్ ముందు బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కంటెయినర్ బోల్తా పడిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనలో కంటైనర్ నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు క్రేన్ సాయంతో కంటైనర్ నుంచి అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వెల్దుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ బాషా పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఈవో ప్రసాదరావు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పార్టీల ప్రతినిధులతో అధికారుల సమావేశం

మాచర్ల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంకు సంబంధించి మాచర్ల మండల పరిధిలో యాగ్జిలరీ పోలింగ్ స్టేషన్ రూపొందించడంపై శుక్రవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. యాగ్జిలరీ పోలింగ్ స్టేషన్ గురించి స్క్రీన్ ద్వారా అధికారులు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంపీడీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నీలంరాజు ప్రతిభ

మాచర్ల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయ క్రీడల్లో శుక్రవారం జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మాచర్ల పట్టణంలోని హనుమాన్ వ్యాయామశాలలో శిక్షణ పొందుతున్న కొమెర నీలంరాజు ప్రథమస్థానంలో నిలిచినట్లు వ్యాయామశాల కోచ్ రాచమంటి ఆదివిష్ణు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా నీలంరాజును కోచ్ గౌస్ మొహీద్దీన్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకేశవ యాదవ్, సీనియర్ సభ్యులు గోగుల అంజిరెడ్డి, గాదె శ్రీనివాసరావు, పులుసు రఘునాథరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, రాము, డాక్టర్ విష్ణువర్ధన్‌లు అభినందించారు. ప్రస్తుతం నీలంరాజు గుంటూరు రైల్వేలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

చినగార్లపాడులో పశువైద్య శిబిరం

కారంపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగార్లపాడులో శుక్రవారం పశువైద్యాధికారి సాల్మన్‌సింగ్ ఆధ్వర్యాన ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

● పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు
● పాల్గొన్న ఆర్యవైశ్యసంఘీయులు
● ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు



పిడుగురాళ్లలో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పిడుగురాళ్లలోని అమ్మవారి దేవాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దేవాలయ అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, డాక్టర్ వున్నం నాగ మల్లికార్జునరావు, కొత్త రఘురామయ్య, యేలూరి చంద్రశేఖర్, కనిగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో బచ్చు కొండలు, కొల్లిపర కాశీవిశ్వనాథం, జవ్వాజి రామ్మోహనరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, ఆర్యవైశ్య యువకులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అవిశ్రాంత కృషి చేస్తోందని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి ఆ



మాచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

త్మార్పణ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, పోలూరి నరసింహారావు, సూరె యలమంద పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య బాలికలచే కుంకుమార్చన జరిపారు. ఆలయ అర్చకుడు బత్తినపాటి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భవనాసి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతురావు, వెంకట బాలజనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వాసవీ క్లబ్ ఆధ్వర్యంలోనూ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం జరిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భవనాసి రవి తేజ, సత్యనారాయణ, బత్తుల బ్రహ్మం, జయలక్ష్మి, ఓరుగంటి చెన్నకేశవరావు, చుండూరు సత్యనారాయణ, మేడం తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన కారంపూడిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ సూరేపల్లి యలమంద ఆధ్వర్యాన ఉదయం నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి చీరతో అలంకరించారు.

రెంటచింతల (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చనతో పాటు వివిధ రకాల పూజలు చేశారు. అన్నదానం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంజనేయుని విగ్రహం సెంటర్‌లో అమ్మవారి చిత్రపటానికి పూజలు చేశారు. ముందుగా సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఆర్యవైశ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గూండా రమేష్, కొప్పురావూరి కోటేశ్వరరావు, సూరె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ ఆర్యవైశ్య సంఘం నేతలు అనుమాల పూర్ణ ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు, లలిత సహస్రనామార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు కోట భాస్కర్, మల్లికార్జునరావు, కోట శంకర్, లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



క్రోసూరు వాసవి అమ్మవారి ఆలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం, టీడీపీ నేతలు

సీఎంఆర్ఎఫ్ రూ.10 లక్షలు చెక్కు అందజేత

● బాలుడి కిడ్నీ శస్త్రచికిత్స నిమిత్తం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సిఫారసు

పెదకూరపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన జూనుబోయిన నాగ వెంకట్ అనే బాలుడు కిడ్నీ వృద్ధి చెందకపోవడమనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. బాలుడిని పరీక్షించిన వైద్యులు కిడ్నీకి శస్త్రచికిత్స అవసరమని, అందుకు రూ. 18 లక్షలు ఖర్చు అవుతుందని ఆ బాలుడి తల్లిదండులుకి తెలిపారు. దీంతో ఏం చేయాలో తోచని స్థితిలోవున్న వారి పరిస్థితి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వారికి అండగా నిలిచారు. వెంటనే బాలుడి తండ్రి శ్రీనుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి తన సిఫారసు ద్వారా దరఖాస్తు చేయించారు. దీంతో పభుత్వం రూ.10 లక్షలను ఆ బాలుడి వైద్యంకోసం మంజూరు చేసింది. ఆయా



రూ.10 లక్షలు చెక్కును అంద చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నగదు చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆ బాలుడికి తల్లిదండ్రులకు అందజేశారు. ఈసందర్భంగా బాలుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన పింఛన్ల సర్వే

సత్తెనపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈనెల 6న ప్రారంభమైన బోగస్ పింఛన్ల ఏరివేత సర్వే శుక్రవారంతో ముగిసింది. సత్తెనపల్లి పట్టణంలో 8, మండలంలో 47, నకరికల్లు మండలంలో 54, ముప్పాళ్ళ మండలంలో 25, రాజుపాలెం మండలంలో 30 పింఛన్‌ల పై సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. సర్వేలో 50 శాతం అనర్హులుగా ఉన్నట్టు గుర్తించారు. అయితే ఫిబ్రవరి నుంచే అనర్హులకు పింఛన్‌ను నిలిపివేయనున్నట్టు సమాచారం.

కోడ్‌కి లోబడే పింఛన్ పంపిణీ

మాచవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫిబ్రవరి 1న పంపిణీ చేయనున్న సామాజిక భద్రత పింఛన్‌లను ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి మాత్రమే పంపిణీ చేయాలని ఆయా గ్రామాల సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో మెంగళరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పింఛన్‌దారుల గృహాల వద్దకు వెళ్ళి నగదు అందజేయాలని సూచించారు. మండలంలో మొత్తం 7302 పింఛన్‌లు ఆయా గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేతల విగ్రహాలకు ముసుగులు

దాచేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 10 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో నగర పంచాయతీ అధికారులు శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగులు వేయటం, దాచేపల్లి, నారాయణపురం వివిధ ప్రాంతాల్లోని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించటం వంటి పనులను చేపట్టారు.

12న రైతులతో సమావేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతికి తెలంగాణా రాష్ట్రం ఖమ్మం పరిధిలోని ఎర్రుపాలెం నుంచి గుంటూరుజిల్లా నంబూరు వరకు నిర్మించనున్న రైల్వే లైనుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పల్నాడు జిల్లా అమరావతిమండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల పరిధిలోని బాధిత రైతులను దీనిపై అభ్యంతరాలు కోరడంతో మూడు గ్రామాల 58 మంది రైతులు తమ అభ్యం తరాలు తెలియజేశారు. అభ్యంతరాలు తెలిపిన రైతులకు జనవరి 12న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన సమావేశం జరగనుంది. అభ్యంతరాలు తెలిపిన రైతులు ఈసమావేశానికి హాజరుకావాలని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

మాచర్లటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన మాచర్ల పట్టణంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శ్రీశైలం రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకు కిందనున్న ఎస్‌బీఐ ఏటీఎంలోని అలారం అర్ధరాత్రి 1:27 గంటల సమయంలో మోగింది. ఈ సమాచారం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పట్టణ పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకున్నారు. ఏటీఎంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో ముఖానికి గుడ్డ కట్టుకొనివున్న ఓ వ్యక్తి ఏటీఎం వద్దకు వచ్చి డోర్‌ను తీశాడు. ఆ సమయంలో అలారం మోగడంతో అతను అక్కడి నుంచి పరారైనట్లు రికార్డయింది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఏటీఎంకు ఏ నష్టం జరుగలేదని, నగదు చోరీకి గురికాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు.

పనులు పూర్తిచేసి మంచి పేరు తేవాలి

● సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనురాధ

నకరికల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పనులు చేసి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ మేచారపు అనురాధ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నకరికల్లులో రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా పైపులైన్‌లు తొలగించారని, దీని వల్ల కొన్ని ప్రాంతాల్లో తాగు నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు బాధ్యులైన కాంట్రాక్టర్ పైచర్యలు తీసుకోవాలని, నకరికల్లులోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించాలని కోరారు. ఈనెల 15వ తేదీ లోగా ఈ సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థకు చేరిందని, ఆ భవనాలను నిర్మించే వరకు అద్దె ఇచ్చే భవనంలో ఏర్పాటు చేసి ఆయుర్వేద వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేజర్లలో పైపులైన్ పనులు నిలిచి



మాట్లాడుతున్న ఎంపీపీ ఎం అనురాధ

పోయాయని, ఎత్తిపోతల పనులను పూర్తిచేయటం ద్వారా చేజర్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీటీసీ వెంకటరెడ్డి కోరారు. మినీ గోకులాలు, జల్‌జీవన్ మిషన్ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరారు. చాగల్లులో పైలెట్ ప్రాజెక్టుగా భూరీ సర్వే జరుగుతుందని, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోవున్న బోరింగ్ పంపులను బాగుచేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో జీ కాశయ్య, ఏవో ఉసర్తి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

రెంటచింతల,జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా ఎం అర్జున్ నాయక్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన బొల్లాపల్లి నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అర్జున్ నాయక్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు బాలయ్య, పాపారావు, శంకర్ రెడ్డి, లింగయ్య, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో నాచు తొలగింపు

పెదకూరపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మేజరు కాలువలో నాచు పెరిగి పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తక్షణమే స్పందించి కాలువలో నాచును వెంటనే తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక నేతలను ఆదేశించారు. దీంతో శుక్రవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు ఒక ఎక్సకవేటర్ ద్వారా కాలువలో నాచు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయా పనులను దగ్గరుండి ఆయన పర్యవేక్షించారు.

మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

పిడుగురాళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు శుక్రవారం స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చి ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్, మాతంగి సత్యానందంలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మందా కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7 హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యమంలో పల్నాడు జిల్లాలోని మాదిగ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో దేవరకొండ సుశీల, నూనె యాకోబు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు శాసన సభ్యుడు బ్రహ్మానందరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట జూలకంటి అక్కిరెడ్డి, ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని సాగరమాత జూనియర్ కళాశాలలో 6 ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించడానికి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ ఎలీషా రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. దీంతో మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు ఇక నుంచి రెంటచింతలకే రావొచ్చు.



సత్తెనపల్లి రిజిస్ట్రార్ కార్యాలయంలో కూర్చున్న క్రయవిక్రయదారులు

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

సత్తెనపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూములు, స్థలాల మార్కెట్ విలువలు పెంచి శనివారం నుంచి రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించటంతో శుక్రవారం రాత్రి స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం రిజిస్ట్రేషన్ దారులతో కిటకిటలాడింది. పెంచిన రిజిస్ట్రేషన్ ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుండటంతో ఆ ధరల భారం పడకుండా సత్తెనలపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో పలువురు శుక్రవారం అప్రమత్తమై రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తరలి వచ్చి తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సాయంత్రం కంప్యూటర్ సర్వర్ మొరాయించటంతో రిజిస్ట్రేషన్ కోసం రాత్రి వరకు రిజిస్ట్రేషన్ దారులు వేచి ఉన్నారు. సాధారణ రోజుల్లో 30 నుంచి 35 వరకు రిజిస్ట్రేషన్ జరిగేవి. రాత్రి 9 గంటల అనంతరమూ రిజిస్ట్రేషన్‌లు కొనసాగాయి.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల విలువలకు రిజిస్ట్రేషన్ ధర ఫిబ్రవరి 1వ తేదీ ఉంచి అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పెదకూరపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రతి రోజు సుమారు ఎనిమిది నుంచి 12 రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. శుక్రవారం 22 రిజిస్ట్రేషన్‌లు జరిగాయి.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం శుక్రవారం జనంతో కిటకిటలాడింది. సాధారణ రోజుల్లో క్రోసూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం ఐదు నుంచి పది రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరుగుతాయి. చార్జీలు పెరగనున్న నేపథ్యంలో శుక్రవారం 60 రిజిస్ట్రేషన్‌లు జరిగినట్టు అధికారులు తెలిపారు. ఉదయం నుంచే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జనం బారులు తీరారు. రాత్రి 8 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్‌లు జరుగుతూనే ఉన్నాయి. వివాదాలకు తావు లేకుండా వచ్చిన రిజిస్ట్రేషన్‌లన్నీ పూర్తి చేశామని సబ్ రిజిస్ట్రేషన్ విజయ ప్రసాదరావు తెలియ జేశారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 1నుండి భూముల మార్కెట్ విలువ పెరుగుతుండటంతో మండల కేంద్రమైన అమరావతిలో గురువారం 51 రిజిస్ట్రేషన్‌లు కాగా శుక్రవారం సర్వర్ మొరాయించడంతో 30 రిజిస్ట్రేసన్‌ల వరకు జరిగాయి. శనివారం నుంచి మండల పరిధిలో మార్కెట్ విలువ 30 శాతం పెరిగుతుందని భూముల క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బారలు దీరారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

● తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

మాచవరం, జనవరి31(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కళాశాల విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మాచవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోర్జంపాడు గ్రామానికి చెందిన షేక్ గుల్జార్(19) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన గుల్జార్ సెలవుల తర్వాత కళాశాలకు వెళ్ళ లేదు. జనవరి 23న ఇంటి వద్ద ఎలుకల మందు తాగింది.విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పిడుగురాళ్ళలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం అక్కడ నుంచి గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకు వెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం గుల్జార్ మృతి చెందింది. హాస్టల్‌లో వసతులు సక్రమంగా లేక పోవటంవలనే తమ కుమార్తె ఎలుకల మందు తీసుకొని మరణించిందని, గుల్జార్ తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

గురజాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద అమరలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం ఏర్పాట్లపై శుక్రవారం ఆర్డీవో మురళీకృష్ణ పట్టణంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యాన చేయబోవు పనులు, సిబ్బంది నియామకంపై పలు సూచనలు చేశారు. భక్తులకు క్యూ, స్నానాల ఘాట్ శుభ్రత, గజ ఈతగాళ్ల, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. ఈనెల రెండో వారంలో మరోమారు సమావేశం కానున్నట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నగేష్, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు, ఎంపీడీవో గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధి నిర్మూలన దినం

క్రోసూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు పీహెచ్‌సీలో శుక్రవారం జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలనకు పాటు పడతామని పీహెచ్‌సీ వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ మహమ్మద్ షాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అంటు వ్యాధి కాదన్నది ప్రతి ఒక్కరు గుర్తుంచు కోవాలన్నారు. స్పర్శ, లెప్రసీ క్యాంపైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్టు వ్యాధి బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారిని మనలో ఒకరిగా చూస్తూ వారిని ఆదరించాలన్నారు. చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉన్న వారు దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సూపర్‌వైజర్ శివుడు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్, టీపీఎస్‌లకు సన్మానం

సత్తెనపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పురపాలక సంఘంలో కమిషనర్‌గా పని చేస్తున్న కే షమ్మి గ్రేడు -3 నుంచి గ్రేడు -2 స్థాయికి పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మునిసిపల్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా పురపాలక సంఘంలో టీపీఎస్‌గా పని చేస్తున్న షేక్ రిజ్వాన టీపీవోగా పదోన్నతి పొంది బదిలీపై విజయవాడ కార్పొరేషన్‌కు వెళ్తున్న సందర్భంగా ఆమెనూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఛలో హైదరాబాద్

● లక్షడప్పుల, వెయ్యిగొంతుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రచారం

మాచవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 7న లక్ష డప్పుల, వెయ్యి గొంతుల ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు గ్రామాల్లో డప్పుల ద్వారా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామంలో మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నేతలు డప్పులతో గ్రామంలో ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి పల్నాడు ప్రాంతం నుంచి వేలాదిగా హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ప్రచార కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాతంగి సత్యానందం, గురుజాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీసాల బాబు, మాచవరం మండల అధ్యక్షులు తుండుం రమేష్, మహిళా జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల, స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనూరు గ్రామంలో శుక్రవారం విజయవాడలోని హల్ప్ ఆస్పత్రి వారు వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ జ్వాలాసాయి ఆధ్వర్యంలో వైద్యులు గ్రామంలోని 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి యాంజియో గ్రామ్ టెస్ట్ విజయవాడలోని డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేయనున్నట్టు డాక్టర్లు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లూరి లక్ష్మీనారాయణ, జంగా శివ, సాధినేని వేణు, మచ్చ ప్రభాకర్, పలకలూరి బొల్లయ్య పాల్గొన్నారు.

జగన్ మళ్లీ అధికారంలోకి రాడు..

● ఆయన అడిగింది ఒక్క ఛాన్సే ● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలన అవినీతిమయం కావటంతో అధికారం కోల్పోయింది.. జగన్‌మళ్లీ అధికారంలోకి రాడు ఆయన ప్రజల్ని అడిగింది ఒక్క ఛాన్సే అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. గుంటూరులో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, మాల, మదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి తెచ్చారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. వర్గీకరణ కేవలం రిజర్వేషన్‌లకే కాదు అన్నింట్లో ఉండాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీల పోస్టుల్లో వర్గీకరణ కావాలి. లక్షల కోట్లు బ్యాంకుల అప్పుల్లో వర్గీకరణ కావాలి, కాంట్రాక్టుల్లో వర్గీకరణ కావాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీలు 33మంది ఉంటే, అందులో ఒకే సామాజికవర్గం (బ్రాహ్మణులు) 20మంది ఉన్నారని పేర్కొన్నారు. అమరావతి కోర్టులో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జడ్జీలున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బ్యాంకులను జాతీయం చేసింది కాంగ్రెస్ పార్టీ, ప్రధాని ఇందిరాగాంధీ. కానీ నేడు ఎస్సీలకు, ఎస్టీలకు, ఓబిసీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పులు 1 శాతం మాత్రమేనని, మిగిలిన 99శాతం బ్యాంకు అప్పులు ఎవరికిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఒకాయనకు రూ.45వేల కోట్లు అప్పులిచ్చాయి. కానీ ఆ వ్యక్తికి మోడీ సాయం చేసి, రూ.40వేల కోట్ల అప్పులు మాఫీ చేయించాడు. పవర్ ప్రాజెక్టు పేరుతో మళ్లీ ఇంకో రూ.10వేల కోట్లు అప్పు కావాలని అడుగుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో వర్గీకరణ జోలికిపోతే సీఎం చంద్రబాబుకే నష్టమన్నారు. వర్గీకరణ కోసం సీఎం చంద్రబాబు వేసిన మిశ్రా కమిషన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ కాంట్రాక్ట్ పనుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో ఎంతమందికిచ్చారు? ఇక్కడ వర్గీకరణ కావాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో వచ్చే 2029 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే నా కోరికని తెలిపారు. కేవలం అమరావతి రాజధానిలో వేల కోట్లు ఖర్చుపెట్టటం సరికాదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి వెచ్చించాలన్నారు. జెమిలి ఎన్నికలతో చంద్రబాబుకే నష్టమని స్పష్టం చేశారు.

అట్టహాసంగా విజ్ఞాన్ బాల మహోత్సవ్

● చిన్నారులకు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు



క్రీడాజ్యోతిని తీసుకువస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎల్లప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా "విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కె25"లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలన్నారు. అదేవిధంగా జంక్‌ఫుడ్ తినకుండా సంప్రదాయ వంటలను మాత్రమే తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రౌండ్‌లో ఆటలు ఆడుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ చదువులో బాగా ఫోకస్ చేయాలన్నారు. విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నట్లైతే మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని తెలిపారు. జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ అన్నారు. విద్యార్థులు కలల సాకారానికి అంకితభావంతో కృషి చేస్తే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడతాయన్నారు. ముందుగా స్పోర్ట్స్ మీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే నిర్వహిస్తామన్నారు. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. వీటితో పాటు మ్యూజిక్ (క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్ లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్‌స్ట్రుమెంట్ సోలో), డాన్స్(క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్), లిటరరీ (వ్యాసరచన, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ (స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్) పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థుల జోరు



వేడుకలకు భారీగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులు



సంగీత పోటీల్లో నువ్వా నేనా అంటూ...



ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మహానాడుకు లోకేశ్ రక్ష

● రూ 294 కోట్ల వ్యయంతో కృష్ణానదికి రిటైనింగ్ వాల్

● మహానాడు వాసులకు తప్పనున్న కృష్ణా వరద ముంపు




సీతానగరం వద్ద కృష్ణాతీరం వద్ద వారధి నుంచి ప్రకాశం బ్యారేజి వైపు రిటైనింగ్‌వాల్ నిర్మించనున్న ప్రదేశమిదే

మంగళగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మహానాడు ఏరియా వాసులకు స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్ అభయహస్తాన్ని అందించారు. తరచుగా వచ్చే కృష్ణానది వరద ముంపునకు గురై నానా అగచాట్లు పడుతూవస్తున్న మహానాడు ప్రాంత ప్రజలను... ఇక ఆ సమస్య నుంచి లోకేశ్ ఒడ్డెక్కిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా వున్న కృష్ణా వరద ముంపు సమస్యను ఎమ్మెల్యే లోకేశ్ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు అయ్యే రూ 294 కోట్ల నిధులను లోకేశ్ మంజూరు చేయించారు. దీంతో మహానాడు వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న పెను సమస్యల పరిష్కారంపై లోకేశ్ దృష్టి పెట్టారు. ఇక ఈ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావేమోనన్న నిరాశల మధ్య నలిగిపోతున్న ప్రజలకు అదృష్టం లోకేశ్ రూపంలో వచ్చి పడింది. ఆయన ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకోవడానికి ముందే మంగళగిరి నియోజకవర్గ సమస్యలపై సంపూర్ణమైన అవగాహనను ఏర్పరచుకున్నారు. అందుకే అధికారంలోకి వచ్చిందే తడవుగా ప్రధానమైన పెను సమస్యలపైనే దృష్టిని కేంద్రీకరించారు. మొన్నటికి మొన్న స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గంచే ఆమోదముద్ర వేయించిన లోకేశ్ మలి సమావేశంలో రూ 53 కోట్ల వ్యయంతో మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారు. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏకంగా రూ 294 కోట్ల వ్యయంతో సీతానగరం మహానాడు ఏరియాను కృష్ణా వరదముంపు నుంచి తప్పించేందుకు రక్షణగోడను నిర్మించేందుకు తీర్మానం ఆమోదింపజేశారు. ఓ రకంగా చెప్పాలంటే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగినప్పుడల్లా మంగళగిరి నియోజకవర్గానికి ఏదొక వరం ప్రాప్తించేలా లోకేశ్ కృషి చేస్తున్నారు.

మహానాడు... తెలుగుదేశంపార్టీకి చాలా ముఖ్యమైన కార్యక్రమం. పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదినం మే 28వ తేదీని పురస్కరించుకుని ప్రతియేటా మే 27 నుంచి 29 వరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయిలో జరుపుకునే ఓ పెద్ద వేడుక. తొలి మహానాడుకు 1983లో విజయవాడ వేదిక కాగా రెండో మహానాడుకు తాడేపల్లి లోని కృష్ణానదీ తీర ప్రాంతమైన సీతానగరం కేంద్రమైంది. నాడు మహానాడు జరుపుకున్న ఆ కృష్ణాతీర ప్రాంత మైదానాన్ని ఆనక పేదల నివాసాల నిమిత్తం ప్రభుత్వం పేదలకు పంచి పెట్టడంతో ఆ ప్రాంతం మహానాడు ఏరియాగా ముద్ర వేసుకుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సుందరయ్యనగర్, మహానాడు కాలనీల పేరుతో వేలాది జనావాసాలు నిండిపోయాయి. అయితే కృష్ణానదికి అయిదు లక్షల క్యూసెక్కులకు మించి వరద వచ్చినప్పుడల్లా మహానాడు ప్రాంతం వరదముంపునకు గురవుతూ వస్తుంది. ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలంటే ప్రకాశం బ్యారేజి దిగువన బ్యారేజి నుంచి కనకదుర్గమ్మవారధి వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ (రక్షణగోడ)ను నిర్మించాలి. వాస్తవానికి కృష్ణా వరదలకు అటు విజయవాడవైపు కృష్ణలంక కూడా ముంపునకు గురౌతుంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు గతంలో విజయవాడ వైపు కూడా కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. ఇపుడు ఇటు గుంటూరు జిల్లా వైపు మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి సీతానగరం కృష్ణాతీరంలో కూడా రిటైనింగ్‌వాల్‌ను నిర్మిస్తే మహానాడు వాసులకు వరద ముంపు సమస్య తప్పుతుంది.

వాస్తవానికి మహానాడు వాసులు ఏనాడు అనుకోని...ఊహించని వరాన్ని లోకేశ్ వారికి ప్రసాదించినట్లే. ముంపు సమస్య పరిష్కారం కావాలంటే రూ వందల కోట్లు కావాల్సిందే. ప్రభుత్వం నుంచి అన్నేసి వందల కోట్లను సాధించి తీసుకొచ్చే వారెవరుంటారులెమ్మని... అక్కడి బాధితులు ఇన్నాళ్లూ మౌనంగానే వుండిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే... ఏ బాధితుడూ... ఏ రాజకీయపార్టీ కూడా మహానాడు వాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరంలో రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని గొంతెత్తి అడుగలేదు. అయినా.. లోకేశ్ వచ్చాడు.. సమస్యను గమనించాడు...దానికి శాశ్వత పరిష్కారమార్గం వైపు నడుం కట్టాడు. త్వరలోనే సీతానగరం ఏరియాలో రైల్వే బ్రిడ్జి ప్రాంతం 0.9 నుంచి కనకదుర్గమ్మ వారధి 2.9 కి.మీల వరకు అంటే రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగనుంది. ఈ రక్షణగోడ నిర్మాణంతో వరదల సందర్భంలో కూడా మహానాడు వాసులు ఏ ఆందోళన లేకుండా ప్రశాంతంగా జీవించే రోజులు రాబోతున్నాయి.



మహానాడు ఏరియా



వరదల సందర్భంలో నది నుంచి మహానాడు నివాసాలను ముంచెత్తిన వరదనీరు (ఫైల్‌ఫోటో)

ముగ్గురు మృతి.. ముగ్గురికి గాయాలు

● ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాల ఢీ

● స్నేహితుడి పుట్టిన రోజు కేక్ కోసం వస్తుండగా ఘటన

● గుంటూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం



బలరామ్, డేవిడ్‌రాజు, గోవర్ధన్ మృతదేహాలు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు సమీపంలోని ఏటుకూరు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు ఘటనా స్థలంలో మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామానికి చెందిన జూటూరి డేవిడ్ రాజు అలియాస్ దావీదు (18), ఎం గోవర్ధన్(18), నల్లచెరువు బొమ్మల సెంటర్‌కు చెందిన ఎన్ బలరాం(38) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, మృతుల బంధువుల కథనం మేరకు.. కుర్నూతల గ్రామానికి చెందిన డేవిడ్ రాజు, గోవర్ధన్, మనీష్ అనే ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. డేవిడ్ రాజు క్లాస్మేట్ అయిన కొర్నేపాడు గ్రామానికి చెందిన యువకుడి పుట్టిన రోజు కావడంతో కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. అదే సమయంలో పర్చూరు వెళ్లే రోడ్డులో రాఘవేంద్ర కాటన్ మిల్‌లో పని చేసే మేస్త్రి ఎన్ బలరాం ద్వి చక్రవాహనంపై మిల్లుకు వెళ్తున్నాడు. ఈయన వద్ద కూలీ పనులు చేసుకునే ఐదో మైలుకు చెందిన రంగమ్మ(45), ఆమె కుమారుడు మల్లికార్జున్(19) గుంటూరు నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో బలరాం కనిపించడంతో ఆయన ద్విచక్ర వాహనం ఎక్కారు. ఏటుకూరుకు, ఐదో మైలుకు మధ్యన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో డేవిడ్ రాజు, గోవర్ధన్, బలరాంలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మనీష్ తలకు గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయినట్లుగా ఉన్నాడు. రంగమ్మకు గాయాలుకాగా ఆమె కుమారుడు మల్లికార్జున్ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. గాయపడిన ముగ్గురిని జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం

అతివేగం.. అజాగ్రత్తతో సంభవించిన ప్రమాదంతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. డేవిడ్ రాజు ఏసీ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గోవర్ధన్ కప్ బోర్డు వర్క్ చేస్తుంటాడు. గాయపడిన మనీష్ ఇంటర్ చదువుతున్నాడు. వారు హెల్మెట్ పెట్టుకోక పోవడంతోనే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు.







ఘటనా స్థలిని పరిశీలిస్తున్న నల్లపాడు సీఐ వంశీధర్

..వరాలిచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అంచనా వేశారు.

● గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్‌కు గత ఏడాది రూ.480 కోట్లు కేటాయించింది. అయితే దిగువమెట్ట వద్ద రిజర్వు ఫారెస్టులో ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉండటంతో పనులు జరగడం లేదు. ఈ కారణంగా అదొక బాటిల్ నెక్‌గా మారింది.

● గుంటూరు-బీబీనగర్(248 కిలోమీటర్ల) రైల్వే డబ్లింగ్‌కి గత ఏడాది రూ.220కోట్ల మూలధనం మంజూరుకావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు జరగాలని రైల్వేవర్గాలు ఆశిస్తున్నాయి. విష్ణుపురం వద్ద బైపాసు లైన్‌కు కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని ఆశిస్తున్నారు.

● గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఇటీవలే రూ.109 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయిస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. పలకలూరు రైల్వేగేటు, ఇన్నర్‌రింగురోడ్డు రైల్వేగేటు వద్ద కూడా ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. వీటికి కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని పలువురు కోరుకుంటున్నారు.

● కేంద్ర ప్రభుత్వ నిధులతో పేరేచర్ల - కొండమోడు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నది. దీనికి ఏమేరకు కేటాయింపులు జరుపుతారోనని అంతా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

● అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

● 72 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న బాపట్ల జిల్లాకు పర్యాటకంగా కేంద్రం ఊతమిస్తే ఉపాధిపరంగా వేలసంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. జిల్లా అభివృద్ధికి ఇంధనంగా ఆతిథ్యరంగం మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొలి అడుగులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.93 కోట్ల కేటాయింపులకు కేంద్రం ఇటీవల పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఆ నిధులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది.

● నిజాంపట్నం మండలం దిండి తీర ప్రాంతంలో సమీకృత ఆక్వాపార్కు నిర్మాణానికి అదనంగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

● బాపట్ల జిల్లాలో 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆక్వా రంగానికి రాయితీల వరాల జల్లు కురిపించడంపై రైతాంగం ఆశతో ఉంది. ఆక్వాపార్కు ప్రాజెక్టు నిర్మాణం వ్యయం పెంచడానికి గతంలోనే కేంద్రం ఆమోద తెలిపింది. రూ.90కోట్ల నుంచి రూ.190కోట్ల వరకు పెంచే ప్రతిపాదనలకు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూడా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.



సూర్యలంక సముద్రతీరం (ఫైల్‌ఫోటో)

కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్న మోదీ ప్రభుత్వం

● సీ పీ ఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మండిపడ్డారు. స్థానిక కొత్తపేటలోని, మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం ఛిద్రం చేస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష నాయకులు ఉన్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జరిగే నిరసనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, కాబోతు ఈశ్వరరావు, బందెల నాసర్ జీ, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ఎగుమతులు పెరిగేలా చూడండి

● ప్రభుత్వపరంగా ఏమి సహకారం కావాలన్నా ఇస్తాం

● రైతుకు గిట్టుబాటు ధర లభించడమే అందరి లక్ష్యం కావాలి

● మిర్చి ట్రేడర్ల సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా మిర్చి ఎగుమతులు పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత మిర్చి ట్రేడర్లను కోరారు. ఎగుమతుల పరంగా ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం కావాలన్నా చేస్తామన్నారు. గతంలో ఎలాగైతే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించిందో అలానే ధర వచ్చేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో డైరెక్టర్ విజయసునీత మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆలోచనని తెలియజేశారు. గత వారంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తుత మిర్చి సీజన్లో రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చూడాలని, మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందించి రెండు రోజుల క్రితం మార్కెటింగ్, వ్యవసాయం, ఉద్యానవాన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం మార్కెటింగ్ డైరెక్టర్ మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మిర్చి మార్కెట్‌పై సమీక్ష చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.94 లక్షల హెక్టరులలో మిర్చి పంట సాగు చేయగా 11.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచన వేయడం జరిగిందన్నారు. గుంటూరు మిర్చియార్డుకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి రైతులు తమ సరుకులను తీసుకొచ్చే అవకాశం ఉన్నందున మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిర్చి ఎగుమతి వ్యాపారస్తులు వెలగపూడి సాంబశివరావు, తోట రామ కృష్ణ, పొత్తూరి నరేంద్ర, కొత్తూరి సుధాకర్, కర్లపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలు రాబోయే రోజుల్లోనూ నిలకడగా ఉంటాయన్నారు. గతంతో పోల్స్తే చైనా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవన్నారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో ఉన్న మిర్చి నిల్వలు ఎగుమతికి అనుకూలంగా లేనందున మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుదల లేదన్నారు, అయినప్పటికీ ఫిబ్రవరి 15 తరువాత పంట దిగుబడులు, మిర్చి ఎగుమతులపై ఒక అంచనా వస్తుందని అప్పటి వరకు ప్రస్తుత మిర్చి ధరలు నిలకడగా ఉంటాయని చెప్పారు. శీతల గిడ్డంగులలో 80 లక్షల బస్తాలు నిల్వ సామర్థ్యం ఉన్న దృష్ట్యా ధర తగ్గినా రైతులు వాటిల్లో నిల్వ చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొంటారని చెప్పారు. సమావేశంలో చివరిలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రైతులకు మార్కెట్లో మిర్చి పంటకు గిట్టుబాటు ధర అందించేందుకు సహకరించవలసినదిగా కోరారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున అధిక సంఖ్యలో మిర్చి బస్తాలు వస్తున్నందున రైతులు, వ్యాపారస్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. యార్డులో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి, 15 తరువాత తదుపరి సమావేశం ఏర్పాటు చేసి మిర్చి దిగుబడులు, ధరలను సమీక్షించి తదుపరి కార్యాచరణ చేపడతామని చెప్పారు.



గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బదిలీపై వెళుతున్న సబ్‌జడ్జికి సత్కారం

నర్సరావుపేట లీగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదోన్నతిపై కృష్ణాజిల్లా మచిలీపట్నం అదనపు జిల్లా న్యాయాధికారిగా వెళుతున్న స్థానిక సబ్ జడ్జి పూర్ణిమకు స్థానిక న్యాయవాద సంఘ సభ్యులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. న్యాయాధికారి పూర్ణిమ మాట్లాడుతూ నరసరావుపేటలో సేవలందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్థానిక న్యాయధికారులు ఎస్ సత్యశ్రీ, మధుస్వామి, ఆశీర్వాదం పాల్‌లు, న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు పలువురు సీనియర్ న్యాయవాదులు న్యాయాధికారి పూర్ణిమ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

నరసరావుపేట లీగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ వద్ద సుమారు రెండు లక్షల విలువైన బంగారాన్ని చోరీచేసిన సంఘటన జనవరి 30న జరిగింది. మొదటి పట్టణ ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనవరి 30న ఉదయం 9గంటల ప్రాంతంలో నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కొడవలి సుజాత అనే మహిళ గుంటూరు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు పర్సులోని బంగారాన్ని దొంగిలించారు. ఈ విషయంపై నర్సరావుపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఆ మహిళ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

కారు అద్దాలు పగులగొట్టి రూ.86వేలు చోరీ

చిలకలూరిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం కారు అద్దాలు పగలగొట్టి రూ.86వేలు దొంగిలించిన సంఘటన జరిగింది. నకరికల్లుకు చెందిన రైస్‌మిల్లు వ్యాపారి చందోలు ప్రకాశరావు చిలకలూరిపేట మండలం యడవల్లిలో భూమిని కొని రిజిస్ట్రేషన్ నిమిత్తం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్దకు వచ్చాడు. కారులో డబ్బులు ఉంచి డోర్లు లాక్‌చేశాడు. ఆయన రిజిస్ట్రేషన్ పనులలో నిమగ్నమై ఉన్న సమయంలో గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించారు.

వృద్ధుడు అదృశ్యం

నరసరావుపేట రూరల్, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాలపాడుకు చెందిన మస్నెం చిన్న అనే 55 సంవత్సరాలు వృద్ధుడు గత వారం రోజుల నుంచి కనిపించడం లేదని రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. చిన్న తరచూ మద్యం సేవిస్తుంటారని ఈ నేపథ్యంలో వారం క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు నరసరావుపేట రూరల్ పోలీసులకు తెలియచేయాలని రూరల్ ఎస్ఐ కిషోర్ కోరారు.

ఐర్లాండ్‌లో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి పలువురి పరామర్శ

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల పడమటి పాలానికి చెందిన గ్రామానికి చెందిన చెరుకూరి సురేష్ (26) ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సురేష్ ఐర్లాండ్‌లో ఎమ్మెస్ చదవడానికి సంవత్సరం క్రితం వెళ్ళాడు. చెరుకూరి రామ కోటయ్య, కుమారి దంపతులకు ఇద్దరు మగపిల్లలు, ఒక కుమార్తె కాగా సురేష్ పెద్ద కుమారుడు. విషయం తెలిసిన తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోగులపాడులో భూ సర్వే ప్రారంభం

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజోతి): మండలంలోని గోగులపాడులో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ బండి నిర్మల శుక్రవారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో విప్పర్ల, గోగులపాడు గ్రామాల్లో రీ సర్వే మధ్యలో నిలిచిపోయింది. మరలా ప్రస్తుత ప్రభుత్వం సర్వేను చేయాలని ఆదేశించటంతో గోగులపాడులో మొదటగా సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో జవ్వాజి ప్రకాశరావు, వీఆర్వో నాయక్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఏఎం కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బెంగుళూరుకు చెందిన వీ స్టాండ్ ఫర్ యూ సొల్యూషన్స్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు శుక్రవారం నిర్వహించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా 8మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనం రూ.4లక్షల వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరి రావు, డైరెక్టర్ డి.శ్రావ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె రవిశంకర్ తదితరులు అభినందించారు.

జోసిల్ కంపెనీని సందర్శించిన ఈశ్వర్ ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గుంటూరు సమీపంలోని జోసిల్ కంపెనీని శుక్రవారం సందర్శించారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా వచ్చిన విద్యార్థులకు జోసిల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సతీష్, పవన్ కంపెనీ గురించి వివరించారు. ఇందులో భాగంగా బయోగ్యాస్ పవర్ ప్లాంట్ పని చేసే విధానం, సబ్బుల తయారీ గురించి తెలియజేశారు. పారిశ్రామిక సందర్శనలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వర రావు, ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆర్.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో అస్తవ్యస్తంగా మురుగు కాలువలు

● నిలిచిపోతున్న మురుగు ● దోమలు, దుర్వాసనతో ఇక్కట్లు పడుతున్న స్థానికులు

బొల్లాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేరుకే మండలం. కనీస సౌకర్యాలు మాత్రం శూన్యం. బొల్లాపల్లిలో మురుగు కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవటంతో పారుదల లేక ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచిపోతోంది. దీంతో గ్రామంలో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటి కారణంగా గ్రామస్థులు చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి వెల్లటూరు వెళ్ళే రహదారిలో, బీసీ కాలనీలోని రహదారుల్లో మురుగునీరు పారదల లేక రోడ్లపై, కాలువల్లో నిలిచిపోతుంది. దీంతో ఆ రోడ్డులో దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. గ్రామంలోని బంగారమ్మ గుడి వద్ద ఐతే మురుగు కాలువలు పూడిపోవటంతో రోడ్లపైకి మురుగునీరు వస్తోంది. గ్రామంలో డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో గ్రామంలో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, అలాగే ఏ వీధికి పోయిన మురుగు వాసనతో అల్లాడుతున్నామని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

మండల స్థాయి అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మురుగునీరు రోడ్లపై పారకుండా కాలువల్లో సిల్టు తొలగించి సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.



కాల్వలు సక్రమంగా లేక నిలిచిపోయిన మురుగు నీరు

వాసవి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



వినుకొండలో అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పిస్తున్న వాసవిక్లబ్, వాసవి వనిత నాయకులు, సభ్యులు

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకా రమేశ్వర అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలో అమ్మవారి గుండప్రవేశం కార్యక్రమం జరిగింది. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, అత్తులూరి సుబ్బరావు, వనమా శివ, కొత్తమాసు మోహర్, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ వాసవి వనిత సభ్యులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి అమ్మవారు అగ్ని ప్రవేశం చేసిన రోజు కావటంతో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, తదితరులు

● చిలకలూరిపేట: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు కుంకుమ పూజలు, చండీ హోమం, అభిషేక కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనకంచివారిపాలెంలో కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజోతి): మండలంలోని కొనకంచివారిపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గరికపాటి తాతయ్య ఆధ్వర్యంలో నరసరావుపేట ఎంవీ రెడ్డి కంటి ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 118 మందికి పరీక్షలు నిర్వహించారు. 12మందికి కంటి శుక్లాలు, ఐదుగురికి కంటి పొరలు ఉన్నట్టు గుర్తించారు. వారికి ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు చేయటం జరుగుతుందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొనుగోటి సాంబశివరావు, వీర్ల సాంబయ్య, పొనుగోటి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి నాసర రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడరన్ టాయిలెట్లు ప్రారంభం



టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

వినుకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ శాసనసభ్యుడు జీవీ అంజనేయులు ఆదేశాల మేరకు పట్టణంలో నూతనంగా నిర్మించిన మోడరన్ టాయిలెట్లను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా వినుకొండ పట్టణ ప్రజలతోపాటు, వివిధ అవసరాల కోసం వినుకొండ వచ్చే గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలు తీర్చేందుకు వీలుగా స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన మోడరల్ టాయిలెట్లను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాల్లో టాయిలెట్ల వలే వినుకొండలోనూతనంగా ఏర్పాటుచేసిన మోడరల్ టాయిలెట్లలో స్నానానికి, స్త్రీ, పురుషులకు ప్రత్యేక టాయిలెట్లను నిర్మించడం జరిగిందని తెలిపారు. యూజ్ అండ్ పే పద్ధతిలో వాటిని వాడుకోవచ్చునని తెలిపారు.





నూతనంగా నిర్మించిన రామాలయం, ప్రత్యేక పూజలు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వైభవంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

వినుకొండటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులుగా వేదపండితులు యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ మాదినేని వెంకటలక్ష్మి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాదినేని అంజనేయులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులతో గ్రామవీధులన్నీ కిటకిటలాడాయి. నాగులవరం ప్రభుత్వ పాఠశాల పీఈటీ గుడిపూడి అంకారావు విద్యార్థులతో నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయానికి వచ్చిన సుమారు 10వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెరువులో చనిపోయిన చేపలు

● దుర్వాసనతో ఇక్కట్లు పడుతున్న కొచ్చెర్ల గ్రామస్థులు



నీటిలో తేలియాడుతున్న చేపలు

ఈపూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల మంగళవారి చెరువులో చేపలు చనిపోయి రెండురోజుల నుంచి దుర్వాసన వస్తోంది. గ్రామానికి తాగు,సాగు, పశువులకు చెరువునీటిని వాడుతుంటారు. పంచాయతీ వారు చెరువులో చేపల పెంపకం కోసం లీజుకు ఇవ్వడంతో చేపల వ్యాపారులు చెరువు నీటిలో వివిధ రసాయనాలు కలపడంతో చెరువు నీరు కలుషితమై విషంగా మారిపోయింది. చెరువులో పనికి రాని చేపలను చంపేందుకు పురుగుల మందు నీటిలో స్ప్రే చేయడంతో అవి చనిపోయి తేలాడుతున్నాయి. అవి ఒడ్డుకు కొట్టుకు రావటంతో పరిసర ప్రాంతాల వారికి భరించరాని దుర్వాసన వస్తోంది. ఆ నీరు తాగడం వలన పశువులకు గర్భకోశవ్యాధుల బారిన పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సోమేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు

సోమేపల్లి సాంబయ్యకు ఘన నివాళి

చిలకలూరిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య 25వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సాంబశివనగర్, భాస్కర్ సెంటర్, తాతపూడిలోని ఆయన విగ్రహాలకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సోమేపల్లి సాంబయ్య శాసన సభ్యులుగా ఉన్నప్పుడు చిలకలూరిపేటలో ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పట్టణవాసులు నీటి కొరత లేకుండా ఏఎంజీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జాన్‌డేవిడ్‌తో కలిసి జర్మనీకి చెందిన దాత డైక్‌మెన్ సాయంతో చిలకలూరిపేటలో 200 ఎకరాలలో తాగునీటి చెరువును ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీ కాలనీలు నెలకొల్పారని, పేదలకు నివేశన స్థలాలు ఇప్పించారన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గోవిందు శంకర శ్రీనివాసన్, బేతంచర్ల రామ కోటేశ్వరరావు, ఎం రాధాకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికలకు నాలుగు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

వినుకొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 27వ తేదీన జరిగే ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ల ఎన్నికలను పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం పరిశీలించారు. గాలి, వెలుతురుతోపాటు ఓటర్లకు అవసరమైన మెరుగైన వసతులు ఉండేలా చూడాలంటూ సిబ్బందిని ఆదేశించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీస్తున్న కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

ప్రారంభమైన శ్రీకృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాలు

నాదెండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంత తొలి ఫొటోగ్రాఫర్, స్వాతంత్ర్య సమరయోధుడు ధూళిపాళ్ల శ్రీకృష్ణమూర్తి శతజయంతి ఉత్సవాలను గణపవరంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ డాక్టర్ జే సీతారామారావు కృష్ణమూర్తితో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, చంద్రశేఖరరావు, కుమారులు శ్రీనివాస విజయలక్ష్మి ప్రసాదు, వెంకటేశ్వరరావు, కాంతారావు, పారిశ్రామిక వేత్తలు మద్ది వెంకటేశ్వరరావు, పేర్ని వీర నారాయణ, హనుమంతరావు, న్యాయవాది లక్ష్మీనారాయణ, హిమవంతరావు, గంగా శ్రీనివాసరావు, ఏవీ శివయ్య తదితరులు శ్రీకృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు.

రుణాల దరఖాస్తుల స్వీకరణ తాత్కాలికంగా నిలిపివేత

నరసరావుపేట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో వివిధ కార్పొరేషన్ల లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు, పల్నాడు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారుల ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తదుపరి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే తెలియపరచగలమన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నూజెండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలపాడు జడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వై శ్రీనివాసరావు, తేజ అకాడమీ డైరెక్టర్ దుర్గారావు, జీ గోవిందయ్య, ఉపాధ్యాయులు ఎం రవిబాబు, ఎం మల్లేశ్వరరావు, సీహెచ్ రామకృష్ణ, కే చెంచారావు, జీ కెజియా, మేరి కుమారి, సయ్యద్, జకీర్, పర్వీన్ పాల్గొన్నారు.

● వినుకొండ: రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి విజయాలు సాధించాలని వినుకొండ విశ్వసాయి జూనియర్ కళాశాల డైరెక్టర్, పట్టణ పురోహితులు డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యారాలు కె.నాగలక్ష్మి పంపిణీచేశారు. కార్యక్రమంలో అప్పరాజు నాగేశ్వరరావు, భాగవతుల రవికుమార్, రామారావు, చంద్రశేఖర్, సిద్ధిక్‌మాస్టారు, లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసీపీ

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శ

చిలకలూరిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమ అవినీతి పత్రిక ద్వారా ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. జాబ్ క్యాలెండర్‌పై వారు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. సొంత కార్యకర్తలను చట్టబద్ధతలేని వలంటీర్లను చేయడం తప్ప జగన్ ఒక్క నిరుద్యోగికి న్యాయం చేశాడా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహణ నిర్ణయంతో పాటు, ఆరువేల పైచిలుకు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ దిశగా అడుగులు వేసిందని ఆయన వివరించారు. నిరుద్యోగ యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చేదిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంటే, ఓర్వలేని రాజకీయ నిరుద్యోగులు విష పత్రికల ద్వారా ప్రజాప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

ఫీజు పోరు చేసే అర్హత వైసీపీ విద్యార్థి విభాగానికి లేదు

● టీఎన్ఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కూరపాటి

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగానికి ఫీజు పోరుచేసే అర్హతలేదని టీఎన్ఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు అన్నారు. శుక్రవారం నరసరావుపేట టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూరపాటి హనుమంతురావు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలు విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యం అన్నారు. జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిల వలన డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులు పూర్తిచేసి ఉన్నత విద్య చదివే అవకాశం లేక పలువురు, ఉద్యోగావకాశాలు కోల్పోయి సతమతమయ్యారని, ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని ధర్నా చేస్తున్నారని అడిగారు. వైసీపీకి నిజంగా విద్యార్థులపై ప్రేమ ఉంటే బకాయిలు చెల్లించకుండా ఎందుకు ఆపారో చెప్పాలన్నారు. జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ఆపేసిన మధ్యాహ్న భోజనం పథకాన్ని నారా లోకేశ్ ఎంతో నిరాడంబరంగా ప్రారంభించారని చెప్పారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎనుగంటి భార్గవ్‌సాయి, జిల్లా ఉపాధ్యక్షుడు ముచ్చు వీరయ్య, అధికార ప్రతినిధి దైద చిన్నబాబు, అబ్దుల్లా పాల్గొన్నారు.

దేవదాయశాఖ మంత్రి ఆనంను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం నెల్లూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో కలిశారు. కోటప్పకొండ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళకు చేయవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు.



మంత్రి ఆనం నారాయణరెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

తరగతుల తరలింపు మానుకోవాలి

● యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను తరలించి కేవలం 1, 2 తరగతులు ఉంచి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేటలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఎల్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొని వచ్చిన ఫౌండేషన్ స్కూల్ విధానం రాష్ట్రంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఒకటి, రెండు తరగతుల మాత్రమే ఉన్న పాఠశాలలో పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడక మూసివేత దిశగా పయనిస్తున్నాయని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, జిల్లా కార్యదర్శులు టీ వెంకటేశ్వర్లు, పీ ప్రేమ్‌కుమార్, జీ ఆంజనేయులు, పీ సత్యానందరావు, ఓ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ రాధాకృష్ణ

యడ్లపాడు, జనవరి 31 (ఆంధ్రజోతి): పశుపోషణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఆయా పథకాలపై పశుపోషకులు అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాల పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని జగ్గాపురంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు గురైన 32 గేదెలకు చికిత్సచేసి ఉచితంగా మందులను అందజేశారు. అంతేగాకుండా 18 గేదెలకు సాధారణ చికిత్సలు, 196 దూడలకు, 156 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో జగ్గాపురం పశువైద్యశాల వీఏఎస్ డాక్టర్ పి.కిరణ్మయి, సహాయకులు సాయిగోపీకృష్ణ, లిఖిత, గోపాలమిత్ర వరప్రసాద్, సిబ్బంది చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని పరగటిచర్ల, రొంపిచర్ల గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. వైద్యులు వంశీకృష్ణ, సాయి మహేష్‌రెడ్డి శిబిరాల్లో పాల్గొని పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని జొన్నలగడ్డ శిబిరంలో ములకలూరు పశువైద్యులు ఎం అర్జున్‌రావు పాల్గొని గేదెలు, ఆవులు, దూడలు, గొర్రెలకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు కూడా చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రామారావు, సహాయ సంచాలకులు రామచంద్రరావు, తదితరులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీచేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, గుమ్మడి వెంకటేశ్వర్లు

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

వినుకొండటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మునిసిపల్ మహిళా పారిశుధ్య కార్మికులకు కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా శుక్రవారం దుప్పట్లు పంపిణీచేశారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న కమిషనర్‌ను చైతన్య స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మందా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం

నాదెండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని పోలేరమ్మ ముని బండమ్మ, అంకమ్మ, మహాలక్ష్మమ్మ తదితర దేవాలయాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఘటానికి గ్రామోత్సవం నిర్వహించారు. సద్దిని అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.